మెరుగైన ఫలితాలే లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఇప్పటికే సిలబస్ పూర్తి.. రివిజన్ ప్రారంభం



పెనుగొండ గురుకుల బాలికల పాఠశాలలో ప్రత్యేక తరగతులు



సిద్ధాంతంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

పెనుగొండ: పదో తరగతిలో నూరు శాతం లక్ష్యం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. మార్చి 17 నుంచి పరీక్షల నిర్వహణకు విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. మరో వైపు పాఠ్యాంశాలు పూర్తి చేసి, రివిజన్ చేయించేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకూ నిర్వహించిన పరీక్షల ఆధారంగా గ్రేడులుగా విడదీసి ఏ సబ్జెక్టుల్లో వీక్‌గా ఉన్నారో గుర్తించి వారికి ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి పాఠశాల ముగిసిన తరువాత కొంత సమయం ప్రత్యేక అభ్యాసన చేయిస్తున్నారు. గతం కన్నా అధికంగా ఫలితాలు సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగుతున్నారు.

ఉపాధ్యాయులకు విద్యా శాఖ ప్రత్యేక సూచనలిస్తూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సాధించాలని లక్ష్యం నిర్దేశించారు. ప్రభుత్వం ముందు నుంచి తగు చర్యలు తీసుకోకుండా ఒక్కసారిగా ఒత్తిడి తీసుకు రావడంపై ఉపాధ్యాయ సంఘాలు గుర్రుగా ఉన్నా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాల కోసం ప్రయత్నిస్తున్నారు. మంచి ఫలితాలు సాధించడం కోసం జిల్లా పరిషత్ నుంచి విజయ కేతనం ప్రత్యేక పుస్తకాన్ని విద్యార్థులకు అందించారు. ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలంలో 486 మంది, పోడూరు మండలంలో 558 మంది, పెనుగొండ మండలంలో 1215 మంది విద్యార్థులు, పెనుమంట్ర మండలంలో 509 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో పదో తరతి పరీక్షలకు హాజరు కానున్నారు.

గురుకుల పాఠశాలలో ప్రత్యేక అవగాహన

పెనుగొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు మార్లు నూరు శాతం ఫలితాల సాధనపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రతి రోజూ సాయంత్రం ఆయా సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

నూరు శాతం ఫలితాలే లక్ష్యం



నూరు శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అనుగుణంగా సబ్జెక్టుల్లో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నాం. మరోసారి వారికి ఆయా పాఠ్యాంశాలను బోధిస్తున్నాం.

ఎస్తేరు క్వీనీ, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, పెనుగొండ

పాఠశాలకు పేరు తీసుకురావాలని..



స్కూల్లో చదవడంతో పాటు, ఇంటివద్ద తెల్లవారుజామున రివిజన్ చేస్తున్నాం. మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. మంచి మార్కులు సాధించడమే లక్ష్యం.

జి.భాను తేజ దుర్గ, పదో తరగతి, పోడూరు

ఉపయుక్తంగా ప్రత్యేక తరగతులు



ప్రత్యేక తరగతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. ప్రతీ సబ్జెక్ట్ టీచర్ అవగాహన కల్పిస్తున్నారు. దీంతో సులభంగా చదవగలుగుతున్నాం. పరీక్షలో మంచి ఫలితం సాధిస్తా. విద్యార్థులను గ్రూపులుగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

గోడి జోష్ని, పదో తరగతి, పెనుమంట్ర

సందేహాల నివృత్తి



గురుకుల పాఠశాలలో సందేహాలు నివృత్తి చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ పరీక్షలు నిర్వహించి, ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దీని వలన మంచి ఫలితం సాధించడం ఖాయం.

గంటా హారిక, గురుకుల పాఠశాల, పెనుగొండ

అధ్వానంగా మున్సిపల్ కాంప్లెక్స్

- అసాంఘిక కార్యక్రమాలకు నెలవు
- శిథిలావస్థకు చేరిన భవనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



నరసాపురంలోని అల్లూరి సత్యనారాయణరాజు మున్సిపల్ కాంప్లెక్స్

నరసాపురం: పట్టణంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ గాడి తప్పింది. పట్టణం నడిబొడ్డున ఉన్న అల్లూరి సత్యనారాయణరాజు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. మరోవైపు భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. అల్లూరి షాపింగ్ కాంప్లెక్స్‌ను 30 ఏళ్ల క్రితం వ్యయ ప్రయాసలతో నిర్మించారు. అప్పట్లో కాంప్లెక్స్ నిర్మాణానికి ఎస్‌బీహెచ్‌లో మున్సిపాలిటీ అప్పు కూడా తీసుకుంది. అంతేకాకుండా కాంప్లెక్స్ నిర్మాణం కోసం మున్సిపాలిటీకి చెందిన విలువైన స్థలాన్ని కూడా అమ్మేశారు. అయితే కాంప్లెక్స్ నిర్మాణం ప్రణాళికాబద్ధంగా సాగకపోవడంతో కాంపెక్స్‌లో షాపులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో భర్తీకాని పరిస్థితి. మొదటి, రెండో అంతస్తులో షాపులు చాలా వరకూ ఖాళీగా ఉంటున్నాయి. దీంతో రాత్రయితే ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే పేకాట, మందుబాబుల వీరంగంతో మార్మోగుతోంది.

శిథిలావస్థలో భవనం

కాంప్లెక్స్ నిర్వహణ సరిగా లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. ఆరేళ్ల క్రితం భవనంలో ఓ భాగం అకస్మాత్తుగా కూలిపోవడం, కింద ఉన్న బార్బర్ షాపులు ధ్వంసమవడం జరిగింది. ఇప్పటికీ ఇదే పరిస్థితి. భవనం కొన్ని భాగాలు ప్రమాదకరంగా ఉన్నాయి. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టడం లేదు. కాంప్లెక్స్‌లో లిఫ్టు సదుపాయం మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. వర్షం వస్తే కాంప్లెక్స్ లోపల దారుణంగా ఉంటుందని వ్యాపారులు వాపోతున్నారు. పార్కింగ్ కోసం కేటాయించిన ప్రాంతంలో కాలు పెట్టలేని పరిస్థితి. మరోవైపు రోడ్డును ఆనుకుని ఉన్న షాపులను లీజుకు తీసుకున్న వ్యాపారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. షాపులను వేలల్లో సబ్ లీజులకు ఇచ్చుకుని మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో ఇవేమీ పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం కాంప్లెక్స్ ద్వారా మున్సిపాలిటీకి నెలకు రూ.1.20 లక్షలు ఆదాయం వస్తోంది. కాంప్లెక్స్ నిర్వహణను గాడిలో పెడితే ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.

మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కి విశేష స్పందన



మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని లజపతిరాయ్‌పేట మాంటిస్సోరి స్కూల్‌లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. ఉదయం పది గంటలకు మాంటిస్సోరి జూనియర్ కళాశాలలో ఈ పరీక్ష నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు రెండో బ్యాచ్ పోటీ పరీక్ష నిర్వహించారు. మొత్తం 980 మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు హాజరయ్యారు. పోటీ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు రూ.120 విలువైన న్యూ మోడల్ పశ్నాపత్రం బుక్‌లెట్ ఉచితంగా అందజేశారు. ఈ పోటీ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు మాంటిస్సోరి జూనియర్ కళాశాల ప్రవేశంలో ప్రాధాన్యత, మెరిట్ స్కాలర్‌షిప్పులు అందజేయనున్నట్లు కళాశాల డైరెక్టర్ కేవీ కృష్ణవర్మ, ప్రిన్సిపాల్ ఎస్‌పీఎస్ ప్రకాశరావు తెలిపారు.

కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలి



ఛాంబర్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కేవీఆర్ నరసింహారావు

పాలకొల్లు అర్బన్: ఛాంబర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమని కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహరావు అన్నారు. కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థి ఎస్ఎస్ శ్రీనివాసగుప్త అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థులు సుమారు 80 మంది పాల్గొని పలు సూచనలు చేశారు. పూర్వ విద్యార్థుల సంఘానికి »కోసక« అని నామకరణం చేశారు. సభ్యత్వ నమోదు, సంఘ రిజిస్ట్రేషన్, బైలా తదితర అంశాలను చర్చించారు. కళాశాలలో పూర్వ విద్యార్థుల అనుభవాలు, గత స్మృతులు గుర్తు చేసుకున్నారు. కళాశాల కార్యదర్శి కనుమూరి సీతారామరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి వాల్గా పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకం



గౌతు లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలో గౌతు లచ్చన్న విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న అన్ని వర్గాలకు చెందిన వారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశానికి సేవలందించారన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మంత్రివర్గంలో వ్యవసాయ కార్మిక శాఖ మంత్రిగా 54 రోజులు పని చేశారన్నారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, కంచి సత్యనారాయణ, జంపన ధనరాజు, కుక్కల యుగంధర్, బాల పరమేశ్వరరావు, గంగారావు, బొల్లా శ్రీనివాస్, పితాని భాస్కరరావు, చెల్లబోయిన గోవింద్, బొక్క సూరిబాబు, గొలగాని రమేష్ యాదవ్, నమ్మి రామకృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలి



సభలో మాట్లాడుతున్న రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య

భీమవరం: రజకులకు సామాజిక రక్షణకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలని, వృత్తి చెరువులపై పూర్తి హక్కు కల్పించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం భీమవరం పట్టణ ప్రథమ మహాసభ ఆదివారం యూటీఎఫ్ ఆఫీస్‌లో నిర్వహించారు. ఈ సభలో భాస్కరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా ప్రత్యేక చట్టం చేయాలన్నారు. కుల వృత్తి చేసే రజకులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, జీవో నంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదరణ పథకం ద్వారా అధునాతనమైన పరికరాలు అందజేసి, సిటీ కేంద్రాల్లో మోడరన్ దోబి ఘాట్లు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మడక రాజు, ఉప్పులూరు చంద్రశేఖర్, రేవూరి గోగిరాజు, చంద్రిక మూర్తి, నర్మవిడి గంగాధర్, బేతపూడి లోకేష్, చింతాడి శ్రీనివాస్, మల్లెపూడి వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, తలుపూరి నవీన్ కుమార్, చించినాడ ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రంపై రుణాల భారం పెంచుతున్న సీఎం చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వినిస్టన్‌బాబు



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: సంపద సృష్టిస్తానని మాయ మాటలు చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు రుణాలు పుట్టించడంలో రికార్డు సృష్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రభుత్వ విధానాలను వినిస్టన్‌బాబు ఎండగట్టారు. ఈ వారం సెక్యూరిటీల వేలం ద్వారా చంద్రబాబు సర్కారు రూ.5వేల కోట్లు అప్పులు తెచ్చిందని, అధికారంలోకి వచ్చి ఆరు నెలల కాలంలో లక్ష కోట్లు అప్పులు చేసి, సంపద సృష్టిస్తున్నట్టు బూటకపు మాటలు చెబుతున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయం అంటే దండగ అన్న చంద్రబాబుకి రైతులపై ప్రేమ ఎందుకుంటుందన్నారు. పండిన ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయడం లేదని దళారులు అయినకాడికి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను దోచుకుంటున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీ మేరకు విద్యుత్ వినియోగదారులపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.2,800 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.1,100 కోట్లు వెంటనే విడుదల చేయాలని వినిస్టన్‌బాబు డిమాండ్ చేశారు. పేదల పాలిట సంజీవినిలా పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ పథకానికి చంద్రబాబు మంగళం పాడే దిశగా ఆలోచన చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వినిస్టన్‌బాబు విమర్శించారు.

పడకేసిన 'పెద్దాసుపత్రి' నిర్మాణం

- గత ప్రభుత్వంలో రూ.38 కోట్ల నిధులు మంజూరు
- ప్రస్తుతం నిలిచిన నిర్మాణ పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



భీమవరంలో నిలిచిన 100 పడకల ఆస్పత్రి భవనం, పిచ్చి మొక్కలతో తుప్పు పడుతున్న ఐరన్ (అంతర చిత్రం)

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరంలోని రూ.38 కోట్లతో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి గ్రహణం పట్టింది. గత ఆరు నెలలుగా ఈ ఆసుపత్రి భవన నిర్మాణం పడకేసింది. గత ప్రభుత్వంలో ఆసుపత్రి భవన నిర్మాణం గ్రౌండ్ ఫ్లోర్ శ్లాబ్ వరకు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆసుపత్రి భవన నిర్మాణం పట్టించుకోలేదు. నిధులు ఉండి కూడా ఆసుపత్రి భవన నిర్మాణం ఆలస్యం కావడం భీమవరం ప్రజలకు శాపంగా మారింది.

తుప్పు పడుతున్న ఐరన్.. వృథాగా మెటీరియల్

100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం కోసం తెచ్చిన ఐరన్ నిర్మాణం లేక పిచ్చి మొక్కలతో తుప్పు పడుతుంది. ఐరన్ భద్రపరిచే చర్యలు కూడా అధికారులు చేపట్టడం లేదు. అలాగే నిర్మాణ మెటీరియల్ ఇసుక, కంకరను అలాగే వదిలేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ఈ భవనం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు

100 పడకల ఆసుపత్రి వేగంగా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే భీమవరంతో పాటు ఉండి, నర్సాపురం నియోజకవర్గాలు, కృష్ణా జిల్లా తీర ప్రాంతాల ప్రజలకు సైతం ఎంతో మేలు కలుగుతుంది. 100 పడకల ఆసుపత్రి కాబట్టి అన్ని వైద్య సేవలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. దీంతో ప్రజలు దూర ప్రాంతాల్లోని ఏలూరు, రాజమండ్రితో పాటు తణుకు జిల్లా ఆసుపత్రికి వెళ్లే ఇబ్బందులు తప్పుతాయి.

స్పెషలిస్ట్ వైద్య సేవలే లక్ష్యంగా వైఎస్ జగన్ ఆసుపత్రి మంజూరు

భీమవరం ప్రజలకు అన్ని రకాల సెష్పాలిస్ట్ వైద్య సేవలు అందజేయాలనే లక్ష్యంతో 100 పడకల ఆసుపత్రి మంజూరు చేశారు. ఆసుపత్రి నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నాలుగు ఎకరాల భూమిని కూడా ఇచ్చారు. తొలుత రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయగా తర్వాత మరో రూ.28 కోట్ల నిధులు మంజూరు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టి గ్రౌండ్ ఫ్లోర్ శ్లాబ్ వరకు తీసుకెళ్లింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈ ఆరు నెలల్లో ఆసుపత్రి భవన నిర్మాణం వేగంగా జరిగేది. ఇప్పటికైనా ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ఈ ఆసుపత్రి భవనాన్ని వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలి.

క్లుప్తంగా

ఉత్సాహంగా ఆటల పోటీలు



పెనుగొండరాజు గూడెంలో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆటల పోటీలు

పెనుగొండ: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పెనుగొండరాజు గూడెం లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం సండే స్కూలు విద్యార్థులకు, సంఘ సభ్యులకు ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, బైబిల్ క్విజ్, బైబిల్ అంశాలపై పోటీ నిర్వహించారు. పోటీల్లోని విజేతలకు జనవరి 1న నిర్వహించే వేడుకల్లో బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉండుర్తి సందీప్, ఖండవల్లి చిన్ని, రాపాక వర్మ, గెద్దాడ శైలజ, ముప్పిడి మౌనిక పర్యవేక్షించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



పెనుగొండ రెల్లి పేటలో క్రిస్మస్ వేడుకలో ప్రార్థన చేస్తున్న పాస్టర్లు

పెనుగొండ: స్థానిక రెల్లి పేటలో క్రీస్తు ప్రార్థనా మందిరం, ఇమ్మానుయేల్ చిల్డ్రన్ ట్రస్ట్ సంయుక్తంగా పాస్టర్ కే జ్యోతి బాబు, పాస్టర్ కే శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆచంట నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఏఐటీసీసీ జిల్లా అధ్యక్షుడు నక్కా వినోద్‌కుమార్ శర్మ పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘ సభ్యులు, పలు సంఘాల పాస్టర్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ ఈవో ఎం అరుణ్‌కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంతర్జాతీయ సదస్సుకు పరిశోధనా పత్రం



గుజరాత్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్ అందుకుంటున్న నాగలక్ష్మి

నరసాపురం: నరసాపురం పట్టణం 10వ వార్డు ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఉపాధ్యాయురాలు వీఎస్ఎస్ నాగలక్ష్మి అరుదైన ఘనత సాధించారు. గుజరాత్‌లోని పలంపూర్ ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్, జీడీ మోదీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ యూనివర్సిటీ సంయుక్తంగా ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు 133 పరిశోధనా పత్రాలు పోటీపడగా 46 ఎంపికయ్యాయి. మన రాష్ట్రం నుంచి నాగలక్ష్మి సమర్పించిన పరిశోధనా పత్రం ఎంపికైంది. భాషాభివృద్ధికి బహు భాష బోధన, ఇంగ్లీష్ ఆవశ్యకత క్రోడీకరిస్తూ నాగలక్ష్మి తన పరిశోధనా పత్రంలో వివరించారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

భీమవరం: ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగమని, ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని కొపా కల్యాణ మండపంలో హైదారాబాద్ కాంటినెంటల్ హాస్పటల్ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. కోపా అధ్యక్షుడు యర్రంశెట్టి హరినాథ్ హైదారాబాద్ కాంటినెంటల్ హాస్పటల్ అసిస్టెంట్ మేనేజర్ కొల్లి సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ కార్డియాలజీ, అంకాలజీ, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులచే ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ చందు కృష్ణతేజ, గోపిశెట్టి మురళీకృష్ణ, అరేటీ సత్యనారాయణ, చెనమల్ల చంద్రశేఖర్, యిర్రింకి సూర్యారావు, ఎంవీ రమణ, యర్రంశెట్టి శివకృష్ణ, లంకి శ్రీనివాస్, కారుమూరి సత్యనారాయణమూర్తి, విజ్జురోతి రాఘవులు, దాయన చంద్రజీ పాల్గొన్నారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో దాసి రాజు చెప్పారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందిస్తే గడువులోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు.

పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రసాద్



కనకం ప్రసాద్

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో ఆదివారం పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనకం ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పులపర్తి మోహన అర్జునుడు, కోశాధికారిగా షేక్ అజీజ్, సంయుక్త కార్యదర్శిగా మేడిది చిట్టిబాబు ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి సంఘ రాష్ట్ర నాయకులు ఊటుకూరి గంగాధర్, మైలా కుమారస్వామి హాజరయ్యారు. పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు కనకం ప్రసాద్ పేర్కొన్నారు.

బీచ్‌కు తగ్గిన సందర్శకుల రాక



కేపీపాలెం బీచ్‌లో తగ్గిన సందర్శకులు

మొగల్తూరు: గత నాలుగు రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉన్నా ఆదివారం పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లకు సందర్శకుల రాక తగ్గింది. ప్రతి ఆదివారం జిల్లాలోని పలుప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల రాకతో బీచ్ ప్రాంతంలో సందడి నెలకొంటుంది. అయితే ప్రస్తుతం ఉదయం నుంచి మంచు కురవడంతో పాటు చలిగాలులు వేయడంతో సందర్శకుల రాక బాగా తగ్గంది. వచ్చిన కొద్ది మంది సందర్శకులు సముద్ర స్నానం చేసి తీరంలోని ఆలయాలను సందర్శించుకున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని మహదేవపట్నంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10400 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని పాములపర్రులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3400 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

భీమవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కొన్ని వర్గాల కోసం కాదని, అన్ని వర్గాల ఐక్యత కోసం రాజ్యాంగాన్ని రచించారని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలోని 38వ వార్డులో వార్డు మాజీ కౌన్సిలర్ పిల్లి మునలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. ఆకివీడు ఎంపీడీవో శ్రీకర్, కొల్లి ప్రసాద్, కోన జోసెఫ్, సారిపల్లి కోటేశ్వరరావు, బిరుదుగడ్డ సుమన్, చినబాబు, గోపిశ్యాం, రెట్టింగి చల్లారావు పాల్గొన్నారు.

సీఐని అభినందించిన డిప్యూటీ స్పీకర్

కాళ్ల: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించిన డెడ్ బాడీ పార్సిల్ కేసును ఛేదించిన పోలీసులకు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అభినందనలు తెలిపారు. ఆదివారం కాళ్ళ మండలం పెదఅమీరంలోని ఆయన కార్యాలయంలో కలిసిన ఆకివీడు సర్కిల్ సీఐ జగదీశ్వరరావుతో మాట్లాడి కేసు ఛేదనలో కీలక పాత్ర వహించిన మిగతా సిబ్బందిని ఆయన అభినందించారు.